సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



ఆ పెన్‌డ్రైవుల్లో ఏముందో..?

ఆర్మీ కాలింగ్ సెంటర్ నిర్వాకాలు ఒక్కోటిగా బయటపడుతున్నాయి. తాజాగా పెన్‌డ్రైవ్‌లు దొరికాయి.

- 8లో



నాలుగు పూరిళ్లు దగ్ధం

కోటిపల్లిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఘటనలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి.

- 8లో

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు

కాశీబుగ్గ: మందస మండలం హరిపురం గ్రామ సమీపాన సర్వే నంబర్ 99లో 0.81 సెంట్లు, సర్వే నంబర్ 97లో పెద్ద చెరువు సుమారు 11 ఎకరాలు విస్తీర్ణంలో కొంత మంది భూకబ్జాకి పాల్పడి భవనాలు నిర్మించుకున్నారు. దీనిపై మందస తహసీల్దార్ ఎస్.హైమావతి, ఇరిగేషన్ శ్రీనివాసరావుకు హరిపురం సర్పంచ్ జగన్నాథపురం పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ భైరిశెట్టి గున్నయ్య ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌దే అంతిమ తీర్పు



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలాన్ని వృధా చేసుకోకూడదని, లోక్ అదాలత్‌ల ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. శనివారం శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానం ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా మొత్తం మీద 19 బెంచీలు నిర్వహించామని, అలాగే రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు జిల్లా అంతటా అదాలత్‌లో పరిష్కారం అయ్యాయని తెలిపారు. లీగల్ సర్వీసులు ప్రజల వద్దకు చేరేలా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్స్, పారా లీగల్ వలంటీర్లను నియమించామని వీరి ద్వారా ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించేందుకు మార్గం సుగమం అయిందన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పులు అంతిమతీర్పులని, వీటిపై అప్పీల్ చేసే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసినాయుడు, నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణి కుమార్, సీనియర్ న్యాయవాది ఇందిరా ప్రసాద్, వివిధ న్యాయస్థానాల న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షి దారులు పాల్గొన్నారు.

'కులగణన చేపట్టాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీల జీవన విధానం, పరిస్థితులపై పూర్తిస్థాయిలో కులగణన నిర్వహించాలని, ఎస్సీ వర్గీకరణతో ఎస్సీలకు తీవ్ర నష్టం కలుగుతుందని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతల దుర్గారావు అన్నారు. నగరంలోని ఇలిసిపురం అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో దళిత మహాసభ దళిత హక్కుల పరిరక్షణ సమితి మాల ఉద్యోగుల సంఘం ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో ఎస్సీల మధ్య చిచ్చు పెట్టి ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలను చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉప్పు.. ముప్పు








బిర్యానీలో ముక్కలు ఎర్రగా లేకుంటే కుదరదు.. న్యూడుల్స్ ఏమాత్రం కలర్ తగ్గినా తినడానికి మనసు ఒప్పుకోదు. ఫ్రైడ్‌రైస్‌లు అవీ మెరుస్తూనే కనిపించాలి. ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ పెరిగాక జనం ఓ రకమైన ఆహారానికి మెల్లగా అలవాటు పడిపోతున్నారు. ఇది ఆరోగ్యాలను దారుణంగా దెబ్బ తీస్తోంది. ముఖ్యంగా టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్ వినియోగం విషయంలో హోటళ్లు ఎక్కడా తగ్గకపోవడం.. వాటి దుష్పరిణామాలపై సామాన్యులకు అవగాహన లేకపోవడంతో.. ఆ విషాన్ని ఇష్టంగా తినేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, యువత ఈ తరహా ఆహారానికి అలవాటు పడి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు.

- రుచుల కోసం విచ్చలవిడిగా టేస్టింగ్ సాల్ట్ వినియోగం
- ఆహార పదార్థాల్లో మితిమీరుతున్న రంగుల వాడకాలు
- అనారోగ్యంపై తీవ్ర ప్రభావం తప్పదంటున్న వైద్యులు

టెక్కలి:



ఆదివారం వస్తే.. బయట బిర్యానీ ఆర్డర్ పెట్టాలి. ఇంటిలో పిల్లాడికి తినాలనిపిస్తే ఏ పిజ్జానో, ఫ్రెంచ్ ఫ్రైసో తీసుకురావాలి. కుటుంబమంతా బయటకు వెళ్తే దర్జాగా హొటల్‌లో కూర్చుని రంగురంగుల పదార్థాలు రుచి చూడాలి. కాలం మారిపోయింది. ఇంటిలో ముందే వండుకుని క్యారియర్లు తీసుకెళ్లడం, అరిసెలు, బొబ్బట్లు వంటివి చేసి పిల్లలకు పెట్టడం వంటి అలవాట్లన్నీ మెల్లగా మటుమాయమైపోయాయి. ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనాల వరకు బయట రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలపై ఆధారపడుతున్నారు. దానికి తగ్గట్టుగానే రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. కానీ ఆహార ప్రియులను మరింత ఆకర్షించేందుకు విచ్చలవిడిగా వివిధ రకాల రంగులు, టేస్టింగ్ సాల్ట్‌లను వినియోగిస్తున్నారు. ఇదే ఇప్పుడు ఆరోగ్యాలను తినేస్తోంది. రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ దుకాణాల విషయం పక్కన పెడితే.. ఇళ్లల్లో సొంతంగా చేసుకునే శుభకార్యాలయాల్లోని భోజనాల్లో సైతం ఈ విషపూరితమైన రంగులు, టేస్టింగ్ సాల్ట్‌ల వినియోగం అధికమవుతోంది.

ఉప్పు, రంగులు వాడితే ఏం జరుగుతుంది..?


- ఆహార పదార్థాల్లో ఎరుపు, పచ్చ, ఆరెంజ్, పసుపు తదితర రంగులు మితిమీరుతూ వాడుతున్నారు.
- టైటానియం డయాక్సైడ్, సిలికాన్ డయాక్సైడ్, మెటల్ ఆక్సైడ్, నానోపార్టికల్స్ ఫుడ్ కలర్‌లో ఉండే రసాయన పదార్థాలు. వీటి వినియోగం వల్ల జీర్ణ కోశ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది.
- బీపీ, సుగర్ పెరిగి కిడ్నీ సమస్యలు ఎక్కువగా వస్తాయి.



- మెటాలిక్ గ్రీన్, మెటాలిక్ ఎల్లో కలర్ చాలా ప్రమాదకరం. ఈ రంగుల్లో కార్మోసిన్ అనే పదార్థం ఉంటుంది. కార్మోసిన్ ఆహారాన్ని ఎరుపుగా మారుస్తుంది. ఈ కార్మోసిన్ కిడ్నీలను దెబ్బతీస్తాయి. ముఖ్యంగా పిల్లలకు కిడ్నీ ఫెయిల్యూర్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీనితో పాటు గుండెపోటుతో సహా అనేక సమస్యలు దారితీస్తాయి.
- టేస్టింగ్ సాల్ట్‌తో మరింత ప్రమాదం. ఈ మధ్య కాలంలో రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్స్, టిఫిన్ దుకాణాలు, ఇళ్లల్లో చేసుకునే వివిధ రకాల కార్యక్రమాల భోజనాల్లో ఆహారం రుచిగా ఉండడానికి టేస్టింగ్ సాల్ట్‌ను వినియోగించడం సర్వసాధారణంగా మారిపోయింది.



- అజినోమోటో అని పిలిచే టేస్టింగ్ సాల్ట్ వాడకం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. టేస్టింగ్ సాల్ట్‌తో చేసిన వంటకాలను తింటే నాడీ వ్యవస్థ బలహీన పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



- పార్కిన్సన్స్, అల్జీమర్స్ వ్యాధులకు టేస్టింగ్ సాల్ట్ ప్రధాన కారణంగా చెప్పవచ్చు.
- టేస్టింగ్ సాల్ట్ ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తినే వారికి సాధారణ వంటకాలతో చేసే వంటకాల రుచులు పూర్తిగా నచ్చవు.
- టేస్టింగ్ సాల్ట్ తీసుకునే వ్యక్తులు త్వరగా చిరాకు పడటంతో పాటు వాంతులు, తలనొప్పి, నొప్పులు, అలసట, ఛాతీపై ఒత్తిడి, గొంతులో, అరచేతుల్లో లేదా అరికాళ్లలో మంటలు ఇతర సమస్యల బారిన పడతారు. గుండె సంబంధిత సమస్యలు, ఊబకాయానికి ఇదో కారణం.



- చిన్న పిల్లల్ని ఎక్కువగా ఆకర్షిస్తున్న జంక్ ఫుడ్, పొటాటో చిప్స్, ఫ్రైడ్ చికెన్‌లో పరిమితికి మించి టేస్టింగ్ సాల్ట్‌ను వాడుతున్నారు.





ఉదర క్యాన్సర్లు వస్తాయి



ఆహారంలో రంగులు, టేస్టింగ్ సాల్ట్ వినియోగం వల్ల కడుపులో క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది. మితిమీరిన రంగుల వినియోగం, రుచుల కోసం వివిధ రకాల టేస్టింగ్ సాల్ట్‌ల వినియోగం తగ్గించాలి.

– కె.లక్ష్మణరావు, ఎండీ, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి

చిన్నారుల్లో మరింత ప్రభావం



ఆహారంలో మితిమీరిన రంగుల వినియోగం, టేస్టింగ్ సాల్ట్‌ల వల్ల ముఖ్యంగా చిన్నారుల్లో అధికంగా అనారోగ్య సమస్యలు వస్తాయి. జీర్ణకోశ సమస్యలతో పాటు రోగ నిరోధక శక్తిని హరిస్తాయి.జంక్ ఫుడ్‌లో వినియోగించే టేస్టింగ్ సాల్ట్ మరింత ప్రమాదకరం.

– బీఆర్‌కే మహారాజ్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, టెక్కలి.

ఆహారంలో రంగుల వినియోగం నిషేధం

రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ దుకాణాల్లో గల ఆహార పదార్థాల్లో వివిధ రకాల రంగుల వినియోగం పూర్తిగా నిషేధం. వీటి వినియోగం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అలాగే టెస్టింగ్ సాల్ట్ వినియోగం సైతం మంచిది కాదు. వీటిపై ప్రజలు చైతన్యం కావాలి.

– కె.వెంకటరత్నం, జిల్లా సహాయ ఆహార నియంత్రణ అధికారి

జర్నలిస్టులపై దాడులు దారుణం



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు

కంచిలి: సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో న్యూస్ కవరేజీకి వెళ్లిన సాక్షి మీడియా ప్రతినిధులపై కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేములలో టీడీపీ శ్రేణులు విచక్షణారహితంగా దాడులకు పాల్పడటం దారుణమైన చర్యగా సోంపేట, కంచిలి మండలాల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రం కంచిలిలో తహసీల్దార్ కార్యాలయం ముందు శనివారం నిరసన వ్యక్తం చేశారు. సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, సాక్షి పత్రికా విలేకరి రాజారెడ్డిలు ఈ దాడుల్లో తీవ్రగాయాలపాలయ్యారని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేసి గాయపరచడాన్ని తామంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నామని అన్నారు. అనంతరం కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటప్పారావు, తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, సోంపేట సీఐ బి.మంగరాజులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమానికి స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి హాజరై దాడులకు గాయాలపాలైన జర్నలిస్టులకు తన సంఘీభావాన్ని తెలియజేశారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఈ కృష్ణమూర్తి

అరసవల్లి: విద్యుత్ పొదుపు చేసే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని, మంచి ఉపకరణాల వినియోగంతో విద్యుత్‌ను ఆదా చేయవచ్చునని విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక అవగాహన ర్యాలీని ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 20 వరకు ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా విద్యార్థులకు, మహిళలకు ప్రత్యేక పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నట్లుగా ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరావు, టెక్నికల్ ఈఈ సురేష్ కుమార్, ఎంఆర్‌టి ఈఈ బయ్యన్నాయుడు, టౌన్ ఎడిఈ చల్లా వెంకటేశ్వరరావు, డి–1 ఎఈ సురేష్‌కుమార్, డి–2 ఎఈ జయరాం తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోటు.. గుర్తించకపోతే చేటు

శ్రీకాకుళం అర్బన్, శ్రీకాకుళం క్రైమ్:

జిల్లాలో మళ్లీ నకిలీ నోట్ల కలకలం రేగుతోంది. ఈ నేపథ్యంలో నకిలీ నోట్లను గుర్తించే విషయంలో ప్రజలు అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దొంగనోట్లు గుర్తించాలంటే 5 నుంచి 8 రీజన్‌లు సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. రూ.100 నుంచి రూ.500 నోట్ల వరకూ రంగు, సైజు తప్ప వాటిపై ఉన్న సెక్యూరిటీ ఫీచర్లు దాదాపుగా ఒకేలా ఉంటాయి.



సెక్యూరిటీ థ్రెడ్

నోటును కంటికి ఎదురుగా పట్టుకుని చూస్తే... మధ్యలో గ్రీన్ కలర్ థ్రెడ్ కనిపిస్తుంది. దీన్ని కొంచెం కిందకు వంచి చూస్తే ఆ థ్రెడ్ బ్లూ కలర్‌లోకి మారుతుంది. అంటే ఎదురుగా పెట్టుకున్నప్పుడు ఆకుపచ్చ రంగులో ఉండే థ్రెండ్, 45 డిగ్రీల కోణంలోకి వంచి చూస్తే... నీలం రంగులో మారుతుంది. ఈ రంగుల మార్పు నకిలీ నోట్లలో కనిపించదు.

లాటెంట్ ఇమేజ్

నోటు ఎడమవైపు కింది భాగంలో ఒక ఇమేజ్ కనిపిస్తుంది. దీన్ని లాటెంట్ ఇమేజ్ అంటారు. లాటెంట్ ఇమేజ్ అంటే దాగి ఉన్న చిత్రం అని అర్థం. మహాత్మా గాంధీ–2005 సిరీస్‌లో విడుదలైన రూ.100 అంతకంటే ఎక్కువ విలువున్న కరెన్సీ నోట్లపై ఈ ఫీచర్ కనిపిస్తుంది. నోటు ఎడమ వైపు కింద భాగంలో కనిపించే పట్టీ లోపల ఆ నోటు విలువ సంఖ్య రూపంలో దాగి ఉంటుంది. ఆ పట్టీపై కాంతి పడేటట్లు చేస్తే పట్టీలో దాగిన ఉన్న లాటెంట్ ఇమేజ్ స్పష్టంగా కనిపిస్తుంది.

బ్లీడ్ లైన్స్

నోటుకి రెండు వైపులా నల్లని లైన్స్‌ఉంటాయి. రూ.500 నోటుకి రెండు వైపులా ఈ లైన్స్ ఐదేసి ఉంటాయి. వీటిని బ్లీడ్ లైన్స్ లేదా బ్లీడ్ మార్క్స్ అంటారు. ఈ లైన్లను చేతితో తాకి చూసినప్పుడు ఉబ్బెత్తుగా ఉన్నట్లు తెలుస్తూ ఉంటుంది. ఈ లైన్స్ ఆ నోటు విలువని తెలుసుకునేందుకు కూడా ఉపయోగపడతాయి. ఐదు లైన్స్ ఉంటే రూ.500 నోట్లు అని, 4 లైన్లు ఉంటే రూ.100 నోటు అని, 4 బ్లీడ్ లైన్ల మధ్యలో రెండు చిన్న వృత్తాలు ఉంటే అది రూ.200 నోటు అని గుర్తించవచ్చు. దృష్టి లోపం ఉన్న వారు నోటు విలువను తెలుసుకోవచ్చు.

ఇంటాగ్లియో ప్రింటింగ్

నోటుకు మధ్యలో మహాత్మా గాంధీ బొమ్మ, ఆర్బీఐ సీల్.. కుడి వైపున అశోకుడి స్తంభం ఉంటాయి. వీటితో పాటు నోటుపై కుడి, ఎడమల చివర్లో ఉండే బ్లీడ్ లైన్లను కూడా ప్రత్యేక విధానంలో ప్రింట్ చేస్తారు. ఈ ప్రింటింగ్‌ను ఇంటాగ్లియో ప్రింటింగ్ లేదా రైజ్డ్ ప్రింటింగ్ అంటారు. ఈ విధానంలో ప్రింటైనవి తాకుతున్నప్పుడు ఉబ్బెత్తుగా ఉంటాయి.

వాటర్ మార్క్, ఎలక్ట్రోటైప్ వాటర్‌మార్క్

సెక్యూరిటీ థ్రెడ్ పక్కన ఆర్‌బీఐ గవర్నర్ సంతకం, దాని కింద ఆర్‌బీఐ ఎంబ్లమ్ ఉంటుంది. దాని పక్కన ఒక ఖాళీగా ఉన్నట్లు కనిపించే భాగంలో పరిశీలించి చూస్తే మహాత్మా గాంధీ బొమ్మతో వాటర్ మార్క్ ఉంటుంది. దీన్ని ఎలక్ట్రో టైప్ వాటర్ మార్క్ అంటారు. అంటే ఇది నోటుపై చెక్కినట్లుగా కనిపిస్తుంది. గాంధీ బొమ్మ వాటర్ మార్క్ పక్కన, అది ఏ డినామినేషనో తెలిపే సంఖ్య ఉంటుంది. అది స్పష్టంగా కనపడాలంటే వెలుతురులో పెట్టి చూడాలి. దీన్ని వాటర్ మార్క్, ఎలక్ట్రో టైప్ వాటర్ మార్క్ టెస్ట్ అంటారు.

న్యూ నంబరింగ్ ప్యాటర్న్

2015 తర్వాత నోటుపై కుడి వైపు కింద భాగంలో ముద్రించి ఉండే సంఖ్యలో ఒక సెక్యూరిటీ ఫీచర్ ఏర్పాటు చేశారు. ఆ సంఖ్య ఎడమ నుంచి కుడికి చూస్తునప్పుడు సంఖ్య సైజు పెరుగుతుంది. అయితే సంఖ్యకు ముందుండే మూడు ఆంగ్ల అక్షరాల సైజు మాత్రం పెరగదు. అవన్నీ ఒకే సైజులో ఉంటాయి. ఆ తర్వాత వచ్చే ఆరు అంకెల సంఖ్యలోని ఒక్కో సంఖ్య సైజు కుడివైపు పెరుగుతూ ఉంటుంది. ఈ సంఖ్య ఏ రెండు నోట్లకు కూడా ఒకేలా ఉండదు.

ఆప్టికల్లీ వేరియబుల్ ఇంక్

నోటుకు కుడివైపున ఆర్బీఐ ఎంబ్లమ్‌కు, అశోక స్తంభానికి మధ్యలో రూ.500 అని ఉంటుంది. ఈ సంఖ్య కంటికి నోటును ఎదురుగా పెట్టుకుని చూసినప్పుడు ఆకుపచ్చ రంగులో, సమాంతరంగా పట్టుకున్నప్పుడు నీలం రంగులోకి మారుతుంది. ఈ సంఖ్య ముద్రణకు ఆప్టికల్లీ వేరియబుల్ ఇంక్ వాడతారు. అందుకే రంగులు మారతాయి. అలాగే నోటుకు కుడివైపు చివర మధ్య భాగంలో రైజ్డ్ ప్రింటింగ్‌లో ఒక చిన్న గుర్తు కనిపిస్తుంది. ఆ గుర్తు రూ.20 నోటుకైతే నిలువుగా ఉండే దీర్ఘ చతురస్రం, రూ.50 నోటుకు చతురస్రం, రూ.100కు త్రిభుజం, రూ.500 నోటుకు వృత్తం ముద్రించి ఉంటాయి. ఈ ఫీచర్ కూడా దృష్టిలోపం ఉన్నవారి కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు.

• మంచు దుప్పట్లో..



చలి గాలులు పెరిగాయి. జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. పల్లెలతో పాటు జిల్లా కేంద్రం సమీప ప్రాంతాల్లో రాత్రిళ్లు మంచు విపరీతంగా కురుస్తోంది. శ్రీకాకుళానికి సమీపంలో రాత్రి పూట జాతీయరహదారిపై విద్యుత్ వెలుగుల్లో పొగమంచు ఇలా కనిపిస్తోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

'తాగునీటి సమస్య పరిష్కరిస్తాం'

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడలో మంచినీటి సౌకర్యంపై ఆందోళన వ్యక్తమవుతోందని, తారక రామ ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసి ఆ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పైడిభీమరం పారిశ్రామికవాడలో గల డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీలో పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించి పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యర్థ జలాలను శుద్ధజలాలుగా మార్చి స్థానిక అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. పారిశ్రామికవాడలో 30వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా ఆ సంఖ్యని 50వేలకు పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తామని అన్నారు. శ్రీకాకుళం ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అండ్ సేఫ్టీ కౌన్సిల్ (సిస్కా)ను పూర్తిస్థాయిలో పని చేసేలా ఆదేశించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, లోకం నాగ మాధవి, డాక్టర్ రెడ్డీస్ పైడిభీమవరం యూనిట్ హెడ్ కేవీఎస్ఎన్ రాజు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పోలీసులను అడ్డగించి.. నిందితుడిని తప్పించి

- నకిలీ నోట్ల కేసులో ఎచ్చెర్ల నిందితులతో పాటు తెస్తున్న రాజమండ్రి ప్రభాకర్‌ను తప్పించిన దుండగులు
- పోలీసులపై దాడి చేసి తీసుకెళ్లిపోయిన వైనం
- రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పీఎస్ పరిధిలో ఘటన

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలో శుక్రవారం ఒకే సారి రెండు చోట్ల దొంగనోట్ల ముఠా ఆటకట్టించి పోలీసులు సుమారు ఎనిమిది మందిని అరెస్టు చేసిన సంగతి విదితమే. వీరినుంచి సుమారు రూ. 72.25 లక్షల నకిలీ నోట్లు, రూ. 1.50 లక్షల నల్లపూత వేసిన నకిలీ కరెన్సీ, కెనాన్ కలర్ ప్రింటింగ్ మిషన్, కలర్ ఇంక్ బాటిల్స్, బ్లేడ్, గమ్ బాటిల్, పేపర్ కట్టలు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. అయితే జి.సిగడాం–లావేరుకు సంబంధించిన కేసులో మన జిల్లాకు చెందిన ఇద్దరు నిందితులను పోలీసులు కష్టపడి తీసుకురావడం వెనుక పెద్ద రిస్కే చేశారన్నది ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే..

నకిలీ నోట్ల కేసులో జిల్లాలో దొరికిపోయిన ఎన్ని రాజేష్, గణగళ్ల రవిలతో లావేరు ఎస్ఐ బి.లక్ష్మణరావు, ముగ్గురు కానిస్టేబుళ్లు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి వెళ్లారు. కీలక సూత్రధారి అయిన రాజమండ్రికి చెందిన ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డి భీమవరంలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మరో కీలక



పోలీసు కారును అడ్డగించిన దృశ్యం

వ్యాపారి కృష్ణమూర్తి రాజమండ్రిలో ఉన్న విషయం తెలిసి భీమవరం నుంచి గురువారం రాత్రి అక్కడికి వెళ్లారు. ఆయన ఆచూకీ లభించకపోవడంతో తిరుగు పయన మయ్యారు. ఈ క్రమంలో రాజమండ్రి ప్రకాష్‌నగర్ పీఎస్ పరిధి వీఎల్‌పురం సమీపంలో 20 మంది దుండగులు పోలీసులు పయనిస్తున్న కారుకు అడ్డంగా వచ్చి కారు ఆపేసి పోలీసులపై దాడి చేసి అందులో కీలక నిందితుడైన ప్రభాకర్‌ను తమ వెంట తీసుకుపోయారు. దొంగనోట్ల వ్యాపారంలో పెద్ద చేయి కావడంతోనే ప్రభాకర్‌ను సినీ ఫక్కీలో తప్పించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాక మన జిల్లాకు చెందిన ప్రముఖులతో కూడా ఈయన సంబంధాలు నెరిపినట్లు సమాచారం. అనంతరం గురువారం రాత్రికి రాత్రే రాజేష్, ర విల అరెస్టు చూపించడం, శుక్రవారం ఉదయం సీఐ అవతారం సమక్షంలో రిమాండ్‌కు తరలించడం చకాచకా జరిగిపోయాయి. .

బాగానే చెలామణీ అవుతున్నారు..

ఈ కేసులో దొరికిన ఎన్ని రాజేష్ సాయంత్రం పత్రికా ఎండీగా, నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ అనే సంస్థకు అధ్యక్షునిగా చెప్పుకుంటూ జిల్లాలో అనేక దందాలు సాగించినట్లు పోలీసుల విచారణలో తేలింది. గణగళ్ల రవి డీఆర్‌డీఏలో పనిచేస్తున్నప్పుడు అనేక ఆరోపణలు ఎదుర్కోవడమే కాక గ్రీవెన్స్‌లో మహిళా సంఘాలు ఫిర్యాదు చేయడంతో సస్పెండ్ అయ్యారు.

దాడి ఘటనపై ప్రత్యేక బృందాల ఏర్పాటు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పోలీసులపై దాడి చేసి, దొంగనోట్ల ముఠా నాయకుడిని సినీఫక్కీలో విడిపించుకుపోయిన ఘటనపై పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి స్థానిక ప్రకాశ్‌నగర్ సీఐ బాజీలాల్ శనివారం ఆ వివరాలను తెలిపారు. వీరంతా ఎక్కడి వారు, శ్రీకాకుళం నుంచే ముందుగా వచ్చారా, లేక ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ప్రభాకర్ ఉంటున్న భీమవరానికి చెందిన వారా.. అనే విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. దుండగులు ఎటువైపు నుంచి వచ్చారు, పోలీసులపై దాడి చేసి నిండితుడిని ఎటువైపు తీసుకెళ్లారనే విషయాలు తెలుసుకునేందుకు సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తున్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందిస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి సోంపేటకు చెందిన సాన సుశీల, ఫకీరు దంపతుల తరపున స్థానిక వ్యాపారి పొట్నూరు శ్రీనివాసరావు రూ.1,11,111 విరాళంగా అందజేశారు. ఈ మేరకు విరాళ చెక్కును ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుకు శనివారం అందించారు. కార్యక్రమంలో వేద పండితులు పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

20న చిన్నయసూరి జయంతి ఉత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాహితీ పీఠం ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో ఈ నెల 20న చిన్నయసూరి 218 జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం చిన్నయసూరి సాహితీ పీఠం గౌరవ అధ్యక్షుడు ఈ వేమన తెలిపారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పెద్దఎత్తున రచయితలు, కవులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సాహితీ పీఠం వ్యవస్థాపకులు తాళ్లూరి విజయ లక్ష్మణ్, గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార రాజు, కవి జంధ్యాల శరత్‌బాబు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి ఘన స్వాగతం



లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న కోచ్, అభిమానులు, కుటుంబ సభ్యులు

కాశీబుగ్గ: థాయ్‌లాండ్‌లో ఈ నెల 1 నుంచి 7 వరకు జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ యూత్ గేమ్స్– 2024లో రాణించిన మంత్ర లోకేష్‌కు ఘనస్వాగతం లభించింది. పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన లోకేష్ హైజంప్‌లో స్వర్ణం, లాంగ్‌జంప్‌లో రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా పలాస రైల్వేస్టేషన్‌లో దిగగా గ్రామస్తులు, క్రీడాకారులు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈయన తల్లిదండ్రులు మంత్ర కామన్న, మంత్ర జయలక్ష్మి భవన నిర్మాణ కార్మికులు. పలాస క్రీడా మైదానం కోచ్ కొణిదల రామారావు వద్ద శిక్షణ పొందుతున్నాడు.


జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని జమ్మూలో ఈ నెల 18 నుంచి జరగనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్రస్థాయి జట్టుకు కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మెట్ట హర్షవర్ధన్, పూజారి కల్యాణ్‌రామ్, చింతాడ జస్వంత్ ఎంపిక య్యారు. వీరిని శనివారం జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, సెక్రటరీ చిగిలిపెల్లి లక్ష్మీదేవి, ఎంపీటీసీ సూర జగదీష్, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు, హెచ్‌ఎం సాయిరాం, పీడీ మొజ్జాడ వెంకటరమణ అభినందించారు. జాతీయ స్థాయిలోనూ మెరుగైన ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షించారు.

ధర్మవరంలో వరి కుప్పలు దగ్ధం



కాలిపోయిన వరి కుప్పలు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ధర్మవరం గ్రామంలో వరి కుప్పలు దగ్ధమయ్యాయి. ఇటీవల తుఫాన్ల హెచ్చరికలు, వర్షాలు సమయంలో రైతులు పొలాల్లో కుప్పలుగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో కొత్తపల్లి సూర్యానారాయణ, రామారావు పొలాల్లోని కుప్పలకు శనివారం మంటలు అంటుకోవడంతో కాలిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. ఈ ఘటనలో రూ.90 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు చెబుతున్నారు. శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అనంతరం బాధితులు రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. ప్రభుత్వం స్పందించి పంటల బీమా ద్వారా తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



ఈ-ఆటోలు.. ఏం చేస్తారో?

- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో నిరుపయోగంగా చెత్త సేకరణ ఆటోలు
- బ్యాటరీలు పాడైపోవడంతో వృథాగా వాహనాలు

కాశీబుగ్గ:

పర్యావరణ పరిరక్షణలో భాగంగా గత ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడంలో భాగంగా పర్యావరణ సహిత ఈ-ఆటోలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సుమారు 75 వేల మంది జనాభా నివాసముండే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలలో ఇరుకైన సందుల నుంచి చెత్త తరలించేందుకు వీలుగా రూ.36 లక్షలు వెచ్చించి తొమ్మిది ఈ-ఆటోలు కొనుగోలు చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్- మున్సిపాలిటీ సంయుక్తంగా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చాయి. అయితే ఈ వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలంటే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ విభాగానికి ఆటోకు నెలకు రూ.69 వేలు చెల్లించాల్సి ఉండటంతో అప్పటి కౌన్సిల్ బాడీ, అధికారులు ముందుకు రాలేదు. ఇంతలో ఎన్నికలు రావడం, అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వాహనాల బ్యాటరీలు పాడైపోయాయి. అటు అధికారులు, ఇటు కౌన్సిల్ ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన వాహనాలు నిరుపయోగంగా మారాయి.

సమున్నత ఆశయానికి తూట్లు

గత ప్రభుత్వ హయాంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా విద్యుత్‌తో నడిచే తొమ్మిది ఈ-ఆటోలను గుంటూరు నుంచి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి తీసుకొచ్చారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవర్లతో వీటిని నడపాల్సి ఉన్నా నిరుపయోగంగా వదిలేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో ఈ-ఆటోలను వినియోగించడానికి కౌన్సిలర్లు తీర్మానం చేయలేదని తెలిసింది.

లేఖ రాశాం..



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈ ఆటోలను మున్సిపాలిటీకి పూర్తి స్థాయిలో అప్పగించకపోవడం, గ్రేడ్-2 మున్సిపాలిటీ కావడంతో నిర్వహణకు సరిపడా ఆదాయం లేకపోవడం వల్లే వాడుకలోకి రాలేదు. ఇప్పుడు బ్యాటరీలు పూర్తి స్థాయిలో పాడైపోయాయి. వాహనాలను వెనక్కి తీసుకెళ్లాలని కార్పొరేషన్‌కు లేఖ రాశాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

కూటమిలో కుమ్ములాట

- ఉద్రిక్తంగా నిద్దాం నీటిసంఘం ఎన్నికలు
- టీడీపీ, జనసేన నాయకుల ఘర్షణ



వాగ్వాదానికి దిగిన టీడీపీ, జనసేన నాయకులు



పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ మధుసూదనరావు

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో శనివారం జరిగిన సాగునీటి ఎన్నికలు ఉద్రిక్తతకు దారి తీశాయి. కూటమి నాయకులు బలబలాలు ప్రదర్శించడంతో ఘర్షణ జరగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. టీడీపీకి చెందిన పైల బాజ్జినాయుడు, పైల రామకృష్ణంనాయుడు ఓ వర్గం కాగా, జనసేనకు చెందిన మీసాల రవికుమార్, విశ్వేశ్వరరావు, స్వామి మరోవర్గంగా ఎన్నిక జరిగే కేంద్రానికి చేరుకున్నారు. తొలుత నిద్దాం, మధుపాం, గొబ్బూరు, మెట్టవలస గ్రామాలకు చెందిన 12 టీసీలకు నామినేషన్ ప్రక్రియ వేయగా.. ఇందులో తొమ్మిది ఏకగ్రీవమయ్యాయి. మిగతా మూడు టీసీలకు ఎన్నిక జరగ్గా.. ఉదయం 9.15 గంటలకు ఒక్క వర్గానికి చెందిన అభ్యర్థి నామినేషన్ వేశారు. మరో వర్గానికి చెందిన అభ్యర్థి 10గంటలకు నామినేషన్ వేయడానికి వెళ్లారు. అక్కడ నామినేషన్ వేయడానికి సమయం లేదని మరోవర్గం నాయకులు అభ్యంతరం తెలపడతో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగింది. పరిస్థితి విషమించడంతో ఎస్‌ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఎన్నిక సజావుగా నిర్వహించుకోవాలని, ఎటువంటి అల్లర్లు సృష్టించవద్దని ఇరువర్గాలకు నచ్చచెప్పారు. అనంతరం మూడు టీసీలకు ఎన్నికలు నిర్వహించారు.

పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నిక

నిద్దాంలో శనివారం రాత్రి పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నిక పూర్తి చేశారు. 10వ టీసీలో పోలింగ్ కంటే లెక్కింపులో నాలుగు ఓట్లు అదనంగా వచ్చాయని, రీ కౌంటింగ్ చేయాలని జనసేన నాయకులు పట్టుపడ్డారు. రీ కౌంటర్ చేసినప్పటికీ ఓట్లు తేడా ఉండటంతో టీసీని నిలుపుదల చేసి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని టీడీపీ నాయకులు పట్టుబడ్డారు. పరిస్థితి చేయిదాటే పరిస్థితి కనిపించడంతో రణస్థలం సీఐ అవతారం, జి.సిగడాం, రణస్థలం ఎస్‌ఐలు వై.మధుసూదనరావు, చిరంజీవి, ఏఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో చేరుకున్నారు. పరిస్థితిని సద్దుమణిగించారు. అనంతరం చైర్మన్‌గా పైల రామకృష్ణంనాయుడును ఎన్నుకున్నారు.



కేంద్రం వద్ద సీఐ అవతారం, ఎస్‌ఐలు

అంగూరు నీటి సంఘం ఎన్నికల్లో హైడ్రామా

కొత్తూరు: మండలంలోని అంగూరు గ్రామంలో కొత్తచెరువు, వెంకయ్య చెరువులకు సంబంధించి నీటి సంఘం ఎన్నిక శనివారం హైడ్రామా మధ్య ముగిసింది. ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ రావడంతో అధికారులు సాయంత్రం నాలుగున్నర గంటల వరకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించలేదు. చివరకు పోలీసుల సమక్షంలో వాన ఈశ్వరరావును చైర్మన్‌గా, జంక భుజంగరావును వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవడంతో సమస్య ముగిసింది.

కోటిపల్లిలో నాలుగు పూరిళ్లు దగ్ధం




మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పొందూరు: మండలంలోని కోటిపల్లి గ్రామంలో శనివారం జరిగిన ప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. మరో ఇంటికి పాక్షికంగా నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పల్ల అసిరినాయుడు, పల్ల సన్యాసమ్మ, పల్ల మంగమ్మ, పల్ల లక్ష్మి, పల్ల వెంకటమ్మలు దినసరి కూలీలు. శనివారం వీరంతా పొలం పనులకు వెళ్లిపోయారు. సన్యాసమ్మ ఇంట్లో గ్యాస్ లీకై దేవుడి పూజా గదిలోనికి దీపానికి తాకడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న మంగమ్మ ఇంట్లోకి మంటలు వ్యాపించాయి. అందులో గ్యాస్ సిలిండర్ ఉండిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పొందూరు అగ్నిమాపక సిబ్బంది సిలిండర్‌ను బయటకు తీసి మంటలను నిలువరించారు. అప్పటికే ఇళ్లన్నీ దగ్ధమయ్యాయి. బంగారం, డబ్బు, ఆధార్ కార్డులు, పట్టాదారు పుస్తకాలు పూర్తిగా కాలిపోయాయి. బాధితులంతా నిరుపేదలు కావడంతో ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పొందూరు ఫైర్ ఆఫీసర్ అశోక్‌కుమార్, సిబ్బంది గౌరీశంకర్, ఏ.రామకృష్ణ, మహేష్, వెంకటేష్, సన్యాసిరావు, నాగరాజులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

అధిక వడ్డీల పేరిట మోసం

టెక్కలి రూరల్: టెక్కలిలోని సంతోషిమాత గుడి సమీపంలో హోల్‌సేల్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తున్న ఆరేటి రుషికేశ్వరరావు అధిక వడ్డీలు ఇస్తానని చెప్పి పలువురి వద్ద సుమారు రూ.40 లక్షలు వసూలు చేశాడు. ఇతని స్వస్థలం భీమవరం. ఎవరికీ చెప్పకుండా పారిపోయాడంటూ బాధితులు అంధవరపు మల్లిబాబు, ఎర్ర నవీన్ కుమార్, కోట శ్రీనివాసరావు, ఆరి ధర్మారావు తదితరులు శనివారం రాత్రి టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టిలో మహేంద్ర తనయ బ్రిడ్జి వద్ద శనివారం రాత్రి గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మెళియాపుట్టి పోలీస్ స్టేషన్‌లో పాతపట్నం సీఐ రామారావు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా అడాఊరుకు చెందిన జోసెఫ్ బీర్, బీహార్‌కు చెందిన అఫ్రోజ్ ఆలం ఒడిశాలోని నువాగొడో గ్రామం నుంచి విశాఖమీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలించేందుకు ఆటోలో బయలుదేరారు. మహేంద్రతనయ బ్రిడ్జిపైకి రాగానే.. ముందస్తు సమాచారం మేరకు నిఘా పెట్టిన ఎస్సై రమేష్ బాబు, పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 22.15 కిలోల గంజాయి, రూ.48,000 నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జోసెఫ్ బీర్ మెళియాపుట్టి మండలానికి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశా గ్రామంలో నివాసముంటూ కూలిపనులు చేస్తూ ఇటువంటి అసాంఘిక పనులు సైతం చేస్తుంటాడు. అఫ్రోజ్ ఆలం విశాఖపట్నంలో 20 ఏళ్లుగా నివాసముంటూ వస్త్రాలు నేసేవాడు. గంజాయి అక్రమ రవాణాలో మరికొందరి హస్తం ఉందని, ఇంకా రూ.లక్షల్లో సొమ్ము చేతులు మారినట్లు గుర్తించామన్నారు. త్వరలోనే వారిని సైతం పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ఇద్దరినీ శనివారం రాత్రి టెక్కలి కోర్టుకు తరలించామని చెప్పారు.

ఘనంగా ఉత్తరాంధ్ర భక్తి సమ్మేళనం



మాట్లాడుతున్న తమిళనాడు రామకృష్ణ మఠానికి చెందిన వేదప్రియానందజీ మహరాజ్

కాశీబుగ్గ: పలాసలోని రామకృష్ణ నరేంద్ర యువజన సేవా సంస్థ, మంచినీళ్లపేటలోని శ్రీరామకృష్ణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పలాస వేదికగా నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్త సమ్మేళనం శనివారం కూడా ఘనంగా జరిగింది. శుక్రవారం మొదలైన ఈ కార్యక్రమంతో ఆదివారంతో ముగియనుంది. దేశవ్యాప్తంగా రామకృష్ణ మఠాల నుంచి స్వామీజీలు విచ్చేసి ఉపన్యాసాలు, సత్సంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏడాదికి ఒక్కసారి నిర్వహించే ఈ భక్త సమ్మేళనం ఈ ఏడాది పలాసలో ఏర్పాటు చేయడంతో స్థానిక భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గీత ఉపదేశ గ్రంథాలు, స్వామీ వివేకానంద పుస్తక ప్రదర్శనలకు విశేష స్పందన లభిస్తోంది. స్థానికులతో పాటు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు.

ఆస్తి కోసం అన్నదమ్ముల కొట్లాట



చికిత్స పొందుతున్న రామ్మోహన్



తీవ్రంగా గాయపడిన రాజేశ్వరి

టెక్కలి రూరల్: ఆస్తి కోసం అన్నదమ్ములు కొట్లాటకు దిగిన ఘటన శనివారం టెక్కలి మండలం తిర్లంగి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్లంగి గ్రామానికి చెందిన పిట్ట జానకిరామయ్య, పిట్ట రామ్మోహన్‌లు అన్నదమ్ములు. తల్లికి చెందిన 50 సెంట్ల భూమి విషయమై కొంతకాలంగా అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కోర్టులో సైతం కేసులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తమ్ముడు రామ్మోహన్ సంబంధిత భూమిలో లాయర్ చెప్పారంటూ బోర్డును పాతాడు. విషయం తెలుసుకున్న అన్నయ్య జానకిరామయ్య తన కుమారుడు నవ్యక్రాంత్‌తో కలిసి శనివారం రామ్మోహన్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో తమ్ముడు లేకపోవడంతో అతని భార్య రాజేశ్వరితో గొడవకు దిగారు. కొడవలితో రాజేశ్వరిని తీవ్రంగా గాయపరిచారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న రామ్మోహన్‌కు సైతం గాయాలయ్యాయి. ఈ గొడవలో జానకిరామయ్య, నవ్యక్రాంత్‌లు కూడా గాయపడ్డారు. గాయపడిన నలుగురినీ టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న టెక్కలి ఎస్‌ఐ రాము ఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

ఇసుక లారీలు పట్టివేత



పట్టుబడిన లారీలు

మెళియాపుట్టి: టెక్కలి పట్నం– గొప్పిలి రహదారిలో చినహంస గ్రామం వద్ద శనివారం నిబంధనలకు విరుద్ధంగా మూడు టిప్పర్లతో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గార నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు డ్రైవర్లు తెలియజేసినా.. వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం మైన్స్ అధికారులకు అప్పగించామని ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

బైక్ ఢీకొని యువకుడు దుర్మరణం



మృతుడు రమేష్ బెహరా

కంచిలి: మండలంలోని కొన్నాయిపుట్టుగ పంచాయతీ సూదిపుట్టుగ గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన రమేష్ బెహరా(25) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. రమేష్ తలతంపర గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి కాలినడకన వస్తుండగా వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. కవిటి మండలం బెజ్జిపుట్టుగకు చెందిన బొరివంక వీఆర్వో గుర్రాల దివాకర్ అతివేగంతో, అజాగ్రత్తగా బైక్ నడపటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. కాగా, రమేష్ చేపలు పట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఐదు నెలల క్రితమే వివాహమైంది. భార్య శ్యాంతి బెహరా ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. భర్త మృతి విషయం తెలిసి కన్నీరుమున్నీరుగా విలపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్ మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఆ పెన్‌డ్రైవుల్లో ఏముందో?

- సంచలనాత్మకంగా ఆర్మీ కాలింగ్ సెంటర్ రమణ వ్యవహారం
- బాత్రూం, మిర్రర్ రూం, హాల్ సీలింగ్‌లో పెన్‌డ్రైవ్‌లు పట్టుకెళ్లారంటున్న విద్యార్థులు
- కొనసాగుతున్న విచారణ



పోలీసులు పట్టుకెళ్లారంటున్న పెన్‌డ్రైవ్‌లు ఇవే

శ్రీకాకుళం క్రైమ్ : ఆర్మీకాలింగ్‌కు సంబంధించి నిర్వాహకుడు రమణకు గతంలో ఎవరైతే వెన్నుదన్నుగా నిలిచి రక్షించారో.. ఇప్పుడూ వారే కొమ్ముకాస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల మధ్య బాధిత విద్యార్థుల నుంచి శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులు మూడు పెన్‌డ్రైవ్‌లు, ఒక 2టీబీ పెన్‌డ్రైవ్ పట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అదే రోజు రాత్రి రెండు కంప్యూటర్లు, మళ్లీ గురువా రం రాత్రి పదికి పైగా పెన్‌డ్రైవ్‌లు సైతం పోలీసులు పట్టుకెళ్లినట్లు బాధిత విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

12 మంది విద్యార్థుల ఫిర్యాదు..

గత సోమవారం రమణపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి కొంతమంది బాధితులు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆర్మీ కాలింగ్ సెంటర్ హాస్టల్ రూరల్ స్టేషన్ పరిధి, కోచింగ్ సెంటర్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండటంతో ఎస్పీ సూచనల మేరకు అదే రోజు రాత్రి రాజాంకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రూరల్ పీఎస్‌లో, మరో ఇద్దరు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. వీరితో పాటు రూరల్ పీఎస్‌లో ఏడుగురు విద్యార్థులు, ఒకటో పట్టణ పీఎస్‌లో ఒక విద్యార్థి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసేందుకు ఈ నెల 10న రూరల్ కానిస్టేబుల్ ఓ బాధిత ఫిర్యాదుదారున్ని ఆర్మీకాలింగ్ సెంటర్‌కు తీసుకెళ్లి విచారణ చేస్తున్న సమయంలో అక్కడి విద్యార్థులు ఒక బ్యాగులో పెన్‌డ్రైవ్‌లున్న విషయం చెప్పడం, అదే సమయంలో స్పెషల్‌బ్రాంచికి చెందిన ఓ కానిస్టేబుల్ ఒకటో పట్టణ పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్‌ఐ వచ్చి తమ పరిధి కాకపోయినా.. రూరల్ పీఎస్ పరిధి అయినా మూడు పెన్‌డ్రైవ్‌లు, ఒక 2టీబీ పెన్‌డ్రైవ్ సైతం పట్టుకుపోయారని, వాటిని ఎస్పీ దృష్టిలో పెట్టారో లేదో అంటూ బాధిత విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

గోడను బద్దలుకొట్టి..

గురువారం రాత్రి సైతం పోలీసులు వచ్చి ఆర్మీ కాలింగ్ సెంటర్ కార్యాలయంలోని హాల్ సీలింగ్, బాత్రూమ్‌సీలింగ్, మిర్రర్ వెనుక సీలింగ్, కప్‌బోర్డు వెనుక గోడను బద్దలు గొట్టి మరీ పదికి పైగా పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ డిస్కులు, కొన్ని డాక్యుమెంట్లు పట్టుకెళ్లినట్లు బాధిత విద్యార్థులు చెబుతున్నారు. అందులో ఫేక్‌గా తయారు చేస్తున్న ఫొటో ఐడెంటిటీ కార్డులు, విద్యార్థులకు ఆర్మీలో ఎన్‌రోల్ అంటూ చూపించే ఫేక్ సర్టిఫికెట్లు, విద్యార్థులను బెదిరింపులు, చిత్రహింసలకు గురిచేసినవి, విద్యార్థుల సెల్‌ఫోన్లు ఇవ్వకుండా దాచేసినవి (ఎక్కడ తమ సమాచారం బయటకు పొక్కుతుందోనని), వేధింపులకు సంబంధించి వీడియోలున్నాయని అంటున్నారు. పెన్‌డ్రైవ్‌లు ఎందుకు తీసుకెళ్తున్నారని అడిగితే సీజ్ చేస్తామని, సైబర్ క్రైమ్‌కు హ్యాండోవర్ చేస్తామన్నట్లు చెప్పారని అంటున్నారు. అయితే ఈ పెన్‌డ్రైవ్‌లు పోలీసులు సీజ్ చేశారో లేదో.. అందులో డేటా భద్రంగా ఉంటుందో లేదోనన్న అనుమానాలు బాధిత విద్యార్థులు వ్యక్తం చేయడం గమనార్హం. ఆర్మీకాలింగ్ ఉదంతంపై పోరాడేందుకు తామంతా సిద్ధంగా ఉన్నట్లు బాధిత విద్యార్థులు చెబుతున్నారు.

శ్రీచక్ర వెలుగులు



బలగ నాగావళి తీరంలోని బాలాత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం శ్రీచక్రరూపేణ సిరిజ్యోతి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించారు. - శ్రీకాకుళం కల్చరల్